క్లుప్తంగా

దళితుల హక్కుల పరిరక్షణకు కృషి

నెహ్రూనగర్: దళితుల సమస్యలు, హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ తెలిపారు. కాకాని రోడ్డులోని కార్యాలయంలో గురువారం సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడిగా విజయరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏసుబాబు మాట్లాడుతూ వర్గీకరణ సాధన కోసం కృషి చేస్తూనే, దళితుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు.

జీజీహెచ్ ఓపీ విభాగంలో రేకుల షెడ్డు ఏర్పాటు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ అవుట్‌పేషెంట్ విభాగంలో రూ. 20 లక్షలతో రేకుల షెడ్డు నిర్మాణం చేపడుతున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. పాత ఓపీ విభాగంలో గురువారం షెడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలోనే షెడ్డును అందుబాటులోకి తీసుకువచ్చి రోగులకు మరింత సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గోవింద నాయక్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని ఉన్నారు.

10న సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజంలో ఈ నెల 10న అమర గాయకుడు ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకుని సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో గాయకులు ఘంటసాల మధుర గీతాల్ని ఆలపిస్తారని తెలిపారు. సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

మంచాల యూపీ స్కూల్‌లో సరస్వతీదేవి విగ్రహావిష్కరణ



మంచాల(చేబ్రోలు): విద్యార్థులు చిన్నతనంలోనే ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని వాటి సాధనకు కృషి చేయాలని చేబ్రోలు మండలం మంచాల గ్రామ సర్పంచ్ చందు వెంకట సాంబశివరావు అన్నారు. మండల పరిధిలోని మంచాల ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఆయన సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాఠశాల ఆవరణలో సర్పంచ్ సొంత ఖర్చుతో చదువుల తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. హెచ్ఎం రత్నశేఖర్, ఆదిన లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబుల అందజేత

మంచాల యూపీ స్కూల్‌లోని 8వ తరగతి విద్యార్థులకు గ్రామ సర్పంచ్ చందు వెంకట సాంబశివరావు ట్యాబులను అందజేశారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పొన్నూరులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

పొన్నూరు: ప్రజా సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ పేర్కొన్నారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గురువారం పొన్నూరు చేరింది. ఈ సందర్భంగా పట్టణంలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన సభలో కమిషనర్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎల్ఈడీ డిస్‌ప్లే ద్వారా పథకాలను తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకట్రావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

చట్టసభల్లో కాపులకు ప్రాధాన్యం కల్పించాలి

ప్రజా కాపునాడు జిల్లా అధ్యక్షునిగా యర్రంశెట్టి

పెదకాకాని: చట్టసభల్లో కాపులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ప్రజా కాపునాడు గుంటూరు జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి నాగరాజు అన్నారు. పెదకాకాని మండలం, కొప్పురావూరు గ్రామానికి చెందిన ఆయన జనవరి 27న జరిగిన సమావేశంలో గుంటూరు జిల్లా ప్రజా కాపునాడు అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ చట్టసభల్లో కాపులకు అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. కాపులంతా ఐకమత్యంగా ఉండాలని, అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేయాలని తెలిపారు. అనంతరం కొప్పురావూరు అడ్డరోడ్డులో ఉన్న లిటిల్‌సిస్టర్స్ ఆఫ్ ది పూర్ వయోవృద్ధుల ఆశ్రమంలో నిర్వాహకులు, వృద్ధులతోనూ మాట్లాడారు. ఆశ్రమంలో వసతుల కల్పనకు సహకారాలు అందిస్తామని చెప్పారు.

జగనన్న పరిపాలన చరిత్రాత్మకం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- అన్నివర్గాల ప్రజల బంగారు భవిష్యత్తుకు పునాదులు
- 36వ డివిజన్‌లో 'మనతో మన రజినమ్మ'కు స్పందన



వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న మంత్రి రజిని



గజమాలతో మంత్రి రజిని, ఎమ్మెల్యే గిరిని సత్కరిస్తున్న పార్టీ కార్యకర్తలు

పట్నంబజారు: రాష్ట్ర రాజకీయ చరిత్రలో జగనన్న పరిపాలన చరిత్రాత్మకమని, సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలోని 36వ డివిజన్ స్తంభాలగరువులో గురువారం 'మనతో మన రజినమ్మ' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డివిజన్ పర్యటనకు వెళ్లిన మంత్రి రజినీకి స్థానికులు అపూర్వ స్వాగతం పలికారు. భారీ బైక్ ర్యాలీ.. తీన్‌మార్ డప్పులతో.. పూల వర్షం కురిపించి వారి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసి.. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి కష్టంలో తానున్నాననే భరోసాని కల్పించిన ఏకైక సీఎం మన జగనన్న అని తెలిపారు. మేనిఫెస్టో అంటే కేవలం ఓట్లు వాడుకునే చిత్తు కాగితంలా టీడీపీ నేతలు భావిస్తే.. దాన్ని పవిత్ర గ్రంథంలా భావించి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా ప్రతి గ్రామంలో సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు ప్రజలకు అందిస్తున్న సేవలకు నిదర్శనంగా నిలుస్తాయని వివరించారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ప్రజలకు కావాల్సిన అన్ని వైద్య సేవలను అందిస్తున్నాయని చెప్పారు. విద్యా, వైద్య రంగాల్లో గొప్ప సంస్కరణలు శ్రీకారం చుట్టి, వాటిని అమలు చేసిన నాయకుడు సీఎం వైఎస్. జగన్ అని కొనియాడారు.

జగనన్నను అడ్డుకునే సత్తా ఎవరికీ లేదు

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని మంత్రి రజిని తేల్చి చెప్పారు. ఎంత మంది కలిసి వచ్చినా. జగనన్నను అడ్డుకునే సత్తా ఎవరికీ లేదని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే.. ప్రజలకు ఏమీ చేయలేదని, గుంటూరులో విధ్వంసం సృష్టించారని ధ్వజమెత్తారు. రోడ్లన్నీ తవ్వేసి ప్రజలు నరకయాతన పడేలా చేశారని మండిపడ్డారు. మరోమారు మాయమాటలు చెప్పి అధికారం దక్కించుకోవాలని టీడీపీ నాయకులు చూస్తారని, మన ఇళ్లకే వచ్చి కల్లబొల్లి కబుర్లు చెబుతారని, వారి మాటలు వినే పరిస్థితుల్లో ప్రజలు లేరని తెలిపారు. ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన కొనసాగిందన్నారు. ఎన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా, కచ్చితంగా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయకేతం ఎగురువేయటం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ జగనన్న గెలుపు.. ప్రజల గెలుపని తెలిపారు. వైఎస్సార్ సీపీ అనేది ఒక కుటుంబమని, సీఎం జగన్ తీసుకున్న నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉడుముల లక్ష్మి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, మండల అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కార్మికుల పక్షపాతి సీఎం జగన్

మేయర్ కావటి



యూనిఫాం పంపిణీ చేస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిరుద్యోగులు, కార్మికుల పక్షపాతి అని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు చెప్పారు. వెహికల్ షెడ్‌లో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లకు, క్లీనర్లకు గురువారం నగరపాలక సంస్థ తరపున యూనిఫాంను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక కార్మికులకు పలు ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి కూడా పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి ఎంతగానో కృషి చేస్తున్నారని, వారి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. ఆయన బాటలోనే గుంటూరు నగరపాలక సంస్థ నడుస్తోందన్నారు. చిరుద్యోగులైన అవుట్ సోర్సింగ్ కార్మికుల సంక్షేమం కోసం ఇన్సూరెన్స్ ప్రీమియాన్ని చెల్లిస్తున్నట్లు చెప్పారు. కార్మికులకు ఏటా యూనిఫాం, దుస్తులు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కాంద్రుకుంట గురవయ్య, ఈఈ కొండా రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సాదు రాజేష్, గేదెల రమేష్, నగరపాలక సంస్థ డీఈఈలు, ఏఈలు, డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

షుగర్, బీపీలపై శాస్త్రీయ అవగాహన అవసరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రావణ్‌బాబు, డాక్టర్ సేవకుమార్, డాక్టర్ కోటేశ్వరరావు

గుంటూరు మెడికల్: ప్రస్తుతం బీపీ, షుగర్ బాధితుల సంఖ్య పెరిగిపోతోందని, ప్రతి ఒక్కరూ వీటిపై శాస్త్రీయ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) వైద్యాధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అన్నారు. గుంటూరులోని 2/1 బ్రాడీపేటలో గల ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో డాక్టర్ తాతా సేవ కుమార్, డాక్టర్ పి.కోటేశ్వరరావు సంయుక్తంగా రచించిన 'డయాబెటిస్–హైపర్ టెన్షన్– తెలుసుకోవలసిన విషయాలు– తీసుకోవలసిన జాగ్రత్తలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ తాతా సేవ కుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో తాము జరిపిన సర్వేలో ప్రతి వంద మందిలో 22 మందికి మధుమేహం, 25 మందికి అధిక రక్తపోటు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీరందరికీ వైద్య సలహాలు, మందులు అందించామని చెప్పారు. అయితే అధిక బీపీ, షుగర్ వ్యాధులపై సరైన శాస్త్రీయ అవగాహన లేనందున, సక్రమంగా చికిత్స పొందకుండా ప్రమాదం ముంచుకొచ్చిన తర్వాత ఆసుపత్రుల్ని ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు. తొలి దశలోనే వైద్యుని సంప్రదించి, సక్రమంగా చికిత్స పొందడం ద్వారా వాటి నుంచి బయటపడవచ్చని చెప్పారు. డాక్టర్ సేవకుమార్, డాక్టర్ పి. కోటేశ్వరరావు తమ 30 సంవత్సరాల అనుభవాలతో రచించిన ఈ పుస్తకం ప్రతి ఒక్కరికీ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణకు ఈ పుస్తకం దిక్సూచిలా పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంపు చైర్మన్ టి.ధనుంజయరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ బీపీ, షుగర్ వైద్య నిపుణులు డాక్టర్ పి.కోటేశ్వరరావు, విశ్రాంత గ్రంథాలయ అధికారి జి.వి.ఎస్. ప్రసాద్, రచయిత. విశ్లేషకులు తూములూరి రాజేంద్రప్రసాద్, రమణబాబు, ఎస్‌హెచ్‌ఓ మేనేజర్ పి.నిర్మలారాణి, ఫార్మాసిస్ట్ మాలిని, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుంటూరు ఈస్ట్: ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన ఎం.తిరుమలరావు అప్పుల బాధ భరించలేక గురువారం జెడ్పీ కాంపౌండ్ సమీపంలో పురుగు మందుతాగాడు. స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్ సహాయంతో జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వ్యక్తి ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. నల్లచెరువుకు చెందిన షేక్ ఇమ్రాన్ (29) అప్పుల బాధ భరించలేక జనవరి 26న కేవీ కాలనీలోని ఖాళీ స్థలంలో పురుగు మందు తాగాడు. అనంతరం విషయాన్ని భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీపై కేసు నమోదు

బార్ అండ్ రెస్టారెంట్‌లో చోరీపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గుజ్జనగుండ్ల సెంటర్‌లోని గోపీకృష్ణ బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు గురువారం ఉదయం తెరిచేందుకు వెళ్లి చూడగా షట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలించగా రూ. 5వేలు కనిపించలేదు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

ఎమ్మెల్యే ముస్తఫా



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరంలాంటిదని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గంలోని ఆరో డివిజన్ రైలుపేటలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పేదవాడి గడప వద్దకు వైద్యాన్ని దగ్గర చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వైద్యం పేదలకు అందని ద్రాక్షలా ఉండేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ పాలనలో పేదల కోసం వైద్య రంగంలో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు జాఫర్ ఖాన్, ఆవుల కోటేశ్వరరావు, జిలాని, ప్రసాద్, కనకదుర్గ, అఫ్రోజ్, సత్యవతి పాల్గొన్నారు.

54వ డివిజన్‌లో...

నియోజకవర్గంలోని 54వ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్‌లోని అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా సందర్శించారు. అనంతరం రోగులతో మాట్లాడి వారికి కావాల్సిన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మల్లవరపు రమ్య, వైఎస్సార్‌సీపీ నేతలు దాస్, రవిరాజు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై శ్రద్ధ వహించాలి

నెహ్రూనగర్: తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ఇంజినీరింగ్ అధికారులు చొరవ తీసుకోవాలని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా సూచించారు. తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్సును గురువారం ఆయన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమాతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి సరఫరాలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. సదరు సమస్యకు పరిష్కారం చూపి, నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎటువంటి అవాంతరాలు లేకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఈఈ కోటేశ్వరరావు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

దళిత ఆదివాసి మేనిఫెస్టో విడుదల



మేనిఫెస్టోను విడుదల చేస్తున్న దేవకుమార్ తదితరులు

నెహ్రూనగర్: రాష్ట్రంలో 25శాతంగా ఉన్న దళిత, ఆదివాసీల ఆకాంక్షల అక్షర రూపమే దళిత ఆదివాసి మేనిఫెస్టో -2024 అని దళిత బహుజన రిసోర్స్ సెంటర్స్ (డీబీఆర్‌సీ)కార్యదర్శి అల్లడి దేవకుమార్ పేర్కొన్నారు. బ్రాడీపేటలో గురువారం మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా దేవకుమార్ మాట్లాడుతూ డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో దళిత, ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి, సాధికారిత కోసం కృషి చేస్తున్న వివిధ సంఘాల నాయకులు, సంస్థలతో సంప్రదింపులు జరిపి మేనిఫెస్టోను రూపొందించినట్లు చెప్పారు. రాష్ట్రంలో దళితులు, ఆదివాసులు, సంచార జాతులకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారం కోసం నిర్దిష్టమైన ప్రతిపాదనలు చేసినట్లు వివరించారు. మేనిఫెస్టోను అన్ని రాజకీయ పార్టీలకు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు గోళ్ల అరుణ్‌కుమార్, మురికిపూడి దేవపాల్, మేడిద బాబూరావు, మల్లెల చిన్నప్ప, జ్యోతి, కోటేశ్వరరావు, భగవాన్‌దాస్ పాల్గొన్నారు.

వింజనంపాడులో కిట్స్ విద్యార్థుల సేవా శిబిరం



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం విజంనంపాడులో కిట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు గురువారం సేవా శిబిరాన్ని నిర్వహించారు. వారం రోజుల పాటు జరగనున్న శిబిరాల్లో భాగంగా తొలి రోజు విద్యార్థులు పంట పొలాల్లో పర్యటించారు. రైతులతో మాట్లాడారు. పంటల సాగు విధానం, పురుగు మందుల పిచికారీ, సేంద్రియ వ్యవసాయం, అధిక దిగుబడులకు సస్యరక్షణ పద్ధతులను తెలుసుకున్నారు. విచ్చలవిడిగా ఎరువులు, పురుగు మందులను వినియోగించడం వలన భూసారం దెబ్బతింటుందని, ప్రతి ఏటా క్రమం తప్పకుండా భూసార పరీక్షలు నిర్వహించి, పంటలను సాగు చేయడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని రైతులకు వివరించారు. మొదటి రోజు శిబారాన్ని గ్రామ సర్పంచ్ ఎన్. నాగలక్ష్మి, ఎంపీటీసీ సుజాత, కార్యదర్శి పి.శివప్రసాద్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.చంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మ్యూజిక్ కంపోజర్ రఘు కుంచె







విజ్ఞాన్ మహోత్సవ్ సందర్భంగా వివిధ అంశాల్లో విద్యార్థుల ప్రదర్శనలు -చేబ్రోలు

బీజేపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం



బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జూపూడి రంగరాజు

గుంటూరు మెడికల్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో గురువారం గుంటూరు పార్లమెంట్ ఎన్నికల కార్యాలయం ప్రారంభమైంది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల యుద్ధం మొదలైందని తెలిపారు. బీజేపీ సంస్థాగతంగా, నిర్మాణ పరంగా ఎన్నికలు ఎదుర్కోవడం కోసం ఇప్పటి నుంచే ముందస్తు వ్యూహాలు అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని, వాటన్నిటిని ప్రజల్లోకి తీసుకెళుతున్నామని తెలిపారు. కేంద్రంలో మరొక్కసారి, రాష్ట్రంలో ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని ప్రజల్ని అభ్యర్థిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ, డాక్టర్ శనక్కాయల అరుణ, మకుటం శివ, భీమినేని చంద్రశేఖర్, ఈదర శ్రీనివాసరెడ్డి, పాలపాటి రవికుమార్, ఆవుల నాగేంద్ర యాదవ్, చరక కుమార్‌గౌడ్, పద్మనాభం, ఆవుల రామకోటేశ్వరరావు, సుగుణ, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి

డెప్యూటీ ఎస్‌వో భానుశ్రీ



గనికపూడిలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ టీం

గనికపూడి (ప్రత్తిపాడు): రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని డెప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎస్‌వో) భానుశ్రీ తెలిపారు. మండల పరిధిలోని గనికపూడిలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం గనికపూడి హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించింది. ఏఎన్ఎం నిర్వహించాల్సిన పన్నెండు రకాల రిజిస్టర్ల నిర్వహణతో పాటు ఎంఎల్‌హెచ్‌పీ నిర్వహిస్తున్న రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఫీల్డ్ వెరిఫికేషన్ చేశారు. యాంటినేటల్ గృహాలను సందర్శించి హెచ్‌బీ పరీక్షలు చేసి, రికార్డుల్లో ఉన్న విధంగా ఉన్నాయా లేదా అన్న విషయాన్ని తనిఖీ చేశారు. ఏఎన్ఎం పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భానుశ్రీ మాట్లాడుతూ రికార్డుల నిర్వహణతో పాటు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కూడా సకాలంలో సక్రమంగా పూర్తి చేయాలని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు సూచించారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో విధులను నిర్వర్తించాలని చెప్పారు. డీపీహెచ్ఎన్ శాంతకుమారి, గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్, సిబ్బంది సైమన్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం పాల్గొన్నారు.

పింఛన్ వచ్చే.. ఆనందం తెచ్చే !



గుంటూరు ఎడ్యుకేషన్: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 25వ డివిజన్‌లో గురువారం వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. సాయినగర్, దుర్గానగర్ ప్రాంతాల్లోని వృద్ధులకు రూ.3 వేల చొప్పున 79వ వార్డు సచివాలయ కన్వీనర్ ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్లు పంపిణీ చేశారు.